క్లుప్తంగా

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

రాజమహేంద్రవరం రూరల్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం చారిత్రాత్మక విజయమని, ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి క్రైస్తవులందరి తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని సామాజికవేత్త డాక్టర్ అద్దంకి రాజయోనా అన్నారు. ఎస్సీల్లో ఉన్నవారు క్రైస్తవ మతంలోకి మారినంత మాత్రాన జీవన స్థితిగతులు మారలేదన్నారు. ఇతర కులాల వారు క్రైస్తవ మతం స్వీకరించినా వారి హక్కులు పోవడం లేదన్నారు.

నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

కడియం: మాధవరాయుడుపాలెంలో ఈనెల 27న ప్రతిష్ఠించనున్న భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామితో పాటు మొత్తం 18 నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా రెండోరోజైన గురువారం నిత్య పూజల అనంతరం ప్రతిష్ఠామూర్తులు, యంత్రములకు క్షీరాధివాసం, ధాన్యాధివాసం చేశారు. అఖండ శివనామ సంకీర్తనలు జరిగాయి. ఫ్రీడమ్ చాటర్ కంపెనీ సీఈవో అన్నందేవుల మణీంద్ర, ప్రేమ దంపతులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కంబాలచెరువు: మన బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక క్వారీ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు గారా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందించే సంకల్పంలో భాగంగా ప్రతినెలా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ఎన్‌జీవో సంస్థలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. సమావేశం అనంతరం ఒక ఘటనలో బాధితుడికి ఆంధ్రప్రదేశ్ విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్ 2015లో రూ.రెండు లక్షల పరిహారాన్ని చెక్కురూపంలో అందజేశారు. అనంతరం జరిగిన యూటీఆర్‌సీ సమావేశంలో న్యాయమూర్తులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులతో మాట్లాడారు. విచారణలో ఉన్న ఖైదీల కేసులలో దర్యాప్తు, చార్జిషీట్ ఫైల్ చేసే విషయాలలో పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ సునీత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అదనపు జిల్లా జడ్జిలు సీహెచ్ రాజగోపాల్, ఎం.నాగేశ్వరరావు, హీఆర్ రాజీవ్, డి.విజయగౌతమ్ పాల్గొన్నారు.

అనర్హత వేటు దారుణం

ప్రకాశం నగర్: జైలు శిక్ష పడిందనే సాకుతో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడం దుర్మార్గమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయనపై అనర్హత తొలగించే వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతాయన్నారు. స్థానిక కృష్ణ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో పీసీసీ సభ్యుడు, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడారు. 2019 కర్ణాటక ఎన్నికల్లో బహిరంగ సభలో మోదీపై రాహుల్ అనుచిత విమర్శలు చేశారని, ఆ పార్టీ మాజీ శాసన సభ్యుడు వేసిన పరువు నష్టం దావా కేసులో కోర్టు రాహుల్ గాంధీకి శిక్ష విధించడం జరిగిందన్నారు. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు అవకాశం ఉండగా రాహుల్ గాంధీపై సస్పెన్షన్ వేటు ఎలా వేస్తారని ప్రశ్నించారు.

శిక్షణ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని జిల్లా మహిళా ప్రాంగణం మేనేజర్ బి.రమణశ్రీ అన్నారు. శుక్రవారం బొమ్మూరులోని మహిళా ప్రాంగణం ఆవరణలో ప్రథమ్ ఐటీసీ–ఎంఎస్‌కే, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీడీపీవో సీహెచ్‌వీ నర్సమ్మ, పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు ఇస్తున్న ప్రీ ప్రైమరీ పుస్తకాలు, ప్లేకిట్లను సద్వినియోగపరుస్తూ పిల్లల సర్వతోముఖాభివృద్ధిని కృషి చేయాలన్నారు.

ఏపీటీఎఫ్ సమావేశం

కంబాలచెరువు: స్థానిక నెహ్రూ నగర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు పింగళి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ నివేదికను ప్రవేశపెట్టారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ డ్రాఫ్ట్‌పై చర్చ నిర్వహించామన్నారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి వరుల అప్పయ్యశాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి ఏ.ఉదయ బ్రహ్మం, డేవిడ్ లివింగ్‌స్టన్, ఉషాకాంత, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


కడియపులంకలో పర్యటిస్తున్న టూరిజం రీజనల్ డైరెక్టర్ స్వామినాయుడు

పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు

కడియం: కడియపులంక ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా అధికారులతో కలిసి కడియపులంకలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడియం మండలంలో విస్తరించి ఉన్న నర్సరీలు, చేనేత, ధవళేశ్వరం బ్యారేజీ, పిచ్చుకలంక, లొల్ల లాకులు తదితర ప్రాంతాల్లో సందర్శకులు పర్యటించేందుకు ఆసక్తి చూపుతారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలను కలుపుకొని పర్యాటకులను ఆకర్షించే విధంగా చర్యలు చేపట్టనున్నామన్నారు. అందుకు అనువుగా స్థానికంగా ఉండే మౌలిక వసతులను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కడియపులంకలో మధ్యలోనే నిలిచిపోయిన భవనాన్ని, పంపింగ్ స్కీమ్ కాలువలను పరిశీలించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మార్గాని అమ్మాణీ కోరారు. అంతకు ముందుగా పంచాయతీ పాలకవర్గంతో డైరెక్టర్ స్వామినాయుడు సమావేశమయ్యారు. జిల్లా అధికారి పి. వెంకటాచలం, సర్పంచ్ మార్గాని అమ్మాణీ, ఉప సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, స్థానిక నాయకులు మార్గాని ఏడుకొండలు, బోడపాటి మూర్తి, సోడసాని దుర్గారావు, పంచాయతీ కార్యదర్శులు జయరాజు, వెంకటలక్ష్మీదేవి పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డులో వెలుగుల తోరణం

- రూ.45 లక్షలతో పనులు
- కోటగుమ్మం నుంచి టౌన్‌హాల్ రోడ్డు వరకూ ఏర్పాటు


మెయిన్ రోడ్డులో లైటింగ్ వ్యవస్థ కోసం జరుగుతున్న పనులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ప్రధాన వర్తక, వ్యాపార కేంద్రం మెయిన్‌రోడ్డుకు మహర్దశ పట్టింది. దానిని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమైంది. వర్తక, వ్యాపార కేంద్రమైన మెయిన్ రోడ్డులో వెలుగులు విరబూయనున్నాయి. నగరపాలకసంస్థ సంప్రదాయబద్ధమైన విక్టోరియల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.45 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న ఈ లైటింగ్ వ్యవస్థకు అవసరమైన చర్యలు చేపట్టారు.

500 మీటర్ల మేర..

కోటగుమ్మం సెంటర్‌లోని శివుని విగ్రహం నుంచి కందుకూరి వీరేశలింగం పంతులు పురమందిరం వరకు సుమారు 500 మీటర్ల మేర లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రోడ్డును తవ్వి లైటింగ్ పనులు పూర్తి చేశారు. ప్రతి 15 మీటర్లకు ఒక లైటు ఏర్పాటు చేసేలా ఈ 500 మీటర్లలో సుమారు 32 లైట్లు వేయనున్నారు. దేవీచౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మాదిరి విక్టోరియల్ లైట్లను ఏర్పాటు చేస్తారు. వీటిలో 50 వోల్టుల సామర్థ్యం కలిగిన బల్బులు బిగిస్తారు. రాజమహేంద్రవరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఎంపీ మార్గాని భరత్ రామ్ మెయిన్ రోడ్డులో విక్టోరియల్ లైటింగ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ ఆమోదం తెలియజేయడంతో లైటింగ్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి.

నెల రోజుల్లో పూర్తి



మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పనులకు అవసరమైన గోతులు తీశాం. విద్యుత్ లైట్ల ఏర్పాటుకు అవసరమైన స్తంభాలను అమర్చేందుకు ప్రక్రియ పూర్తి చేశాం. నెల రోజుల్లో లైటింగ్ పనులు పూర్తి చేస్తాం.

– పాండురంగారావు, ఎస్ఈ, నగర పాలకసంస్థ


నమూనా లైట్లు

సమస్యలు వింటూ.. పరిష్కారం చూపుతూ..

- 31వ డివిజన్‌లో ఎంపీ భరత్‌రామ్ పర్యటన
- ఉత్సాహంగా గుడ్‌మార్నింగ్ రాజమహేంద్రవరం


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించడం కోసం ఎంపీ మార్గాని భరత్‌రామ్ నిర్వహిస్తున్న గుడ్‌మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక 31వ డివిజన్ అశోక్ థియేటర్ నుంచి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళ ఎం.పద్మ మాట్లాడుతూ తమ అబ్బాయి చదువుకుంటాడని డాబాపై చిన్నపాటి రేకుల షెడ్డు వేయిస్తే, ఏకంగా రూ.6 వేలు పన్ను కట్టాలని మున్సిపాలిటీ అధికారులు నోటీసు ఇచ్చారని వాపోయింది. సాధారణంగా రూ.1300 ఇంటి పన్ను వచ్చేదని, చిన్నపాటి రేకుల షెడ్డు వేసినందుకు అనధికార కట్టడమని చెప్పి ఏకంగా రూ.6 వేలు కట్టాలంటున్నారని చెప్పింది. స్పందించిన ఎంపీ భరత్‌రామ్ వెంటనే.. మున్సిపల్ డీసీ సాంబశివరావుకు ఫోన్ చేశారు. చిన్నపాటి రేకుల షెడ్డుకు ఏకంగా నాలుగు రెట్లు ఇంటి పన్ను సరైన విధానం కాదని, సరి చేయాలంటూ సూచించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని (70 గజాలు) కబ్జా చేసి, ఇష్టం వచ్చినట్లు వాడుకుంటున్నారని, ఆ స్థలంలో గ్రంథాలయమో, సచివాలయమో కడితే బాగుంటుందని చర్యలు చేపట్టాలని కోరారు. డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై ప్రజలను అడిగారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. వేలిముద్ర పడక రేషన్ బియ్యం రావడం లేదని ఓ వృద్ధురాలు తెలపగా.. ఎంఎస్ఓ ప్రభాకరరావుకు ఫోన్ చేసి వృద్ధురాలికి రేషన్ బియ్యం ఇప్పించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జిమజ్జి అప్పారావు, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మజ్జి నూకరత్నం, హబీబుల్లా ఖాన్, నల్లా రామాంజనేయులు పాల్గొన్నారు.

బాధితురాలికి నష్టపరిహారం

- ఎంపీ భరత్‌రామ్ చొరవతో చెక్కు అందజేత
- కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబం


బాధితురాలు అచ్చియ్యమ్మకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీ భరత్‌రామ్ ఆదేశాలతో అగ్నిప్రమాద బాధితురాలికి నష్టపరిహారం అందింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక 7వ డివిజన్‌కు చెందిన కె.అచ్చియ్యమ్మ ఇల్లు గతేడాది కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె సర్వం కోల్పోయింది. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం ఇవ్వలేదు. ఎన్నోమార్లు మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గురువారం జరిగిన గుడ్‌మార్నింగ్ రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్‌రామ్‌కు ఆమె ఈ సమస్యను వివరించింది. స్పందించిన ఎంపీ భరత్‌రామ్ వెంటనే తహసీల్దార్‌కు ఫోన్‌చేసి నష్టపరిహారం ఇవ్వకపోవడంపై ఆరా తీశారు. తక్షణమే నష్ట పరిహారం రూ.5 వేలు అందజేయాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ తరఫున వీఆర్వో మురళీ వచ్చి బాధితురాలు అచ్చియ్యమ్మకు వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి సయ్యద్ గౌస్ చేతుల మీదుగా రూ.5 వేల చెక్కు అందజేశారు. ఏడాది తర్వాత ఎంపీ చొరవతో సాయం అందడంతో ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి, ఆ గ్రామ సచివాలయాలకు అదనపు ఆదాయం పెంచడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి పి.జగదాంబ అన్నారు. జగనన్న స్వచ్ఛసంకల్పంలో మోడల్ గ్రామపంచాయతీలుగా ఎంపికైన పంచాయతీ అధికారులకు వెంకటనగరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద శుక్రవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పి.జగదాంబ మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల వద్ద కూరగాయలు, పండ్ల మొక్కలు వేయడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం పెంచాలన్నారు. కంపోస్టు ఎరువును రైతులకు విక్రయించాలన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ కె.సునీల్ ఆరమ్‌స్ట్రాంగ్, వెంకట నగరం పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రాణి, డివిజనల్ రిసోర్స్‌పర్సన్ టి.సతీష్, మండల విస్తరణాధికారుల ఆధ్వర్యంలో తడి, పొడిచెత్త, వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు.

దాస్‌కా దమ్కీ–2తో మీముందుకొస్తా

- ప్రేక్షక దేవుళ్లకు కృతజ్ఞతలు
- హీరో విశ్వక్ సేన్


హీరో విశ్వక్ సేన్‌కు గజమాల వేస్తున్న అభిమానులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దాస్‌కా దమ్కీ పార్ట్ 2 ఇంకా అద్భుతంగా తీసి మీ ముందుకు వస్తానని హీరో విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన నటించి, నిర్మించిన దాస్‌కా దమ్కీ సినిమా విజయవంతమైన సందర్భంగా విజయయాత్ర నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఆయన స్వామి థియేటర్‌లో మేట్నీషోకు హాజరై ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ ఈ సినిమా ఊహించిన దానికన్నా ఎక్కువ విజయాన్ని అందుకుందన్నారు. ఈ విజయం అందించిన ప్రేక్షక దేవుళ్లకు ధన్యవాదాలు తెలిపారు. రాజమహేంద్రవరంలో ఓరి దేవుడా సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు రామ్ చరణ్ వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. తొలుత డప్పు వాయిద్యాలతో అనుశ్రీ ఫిలింస్ అధినేత సత్యనారాయణ స్వాగతం పలికారు. అనంతరం విశ్వక్‌సేన్ కేక్ కట్ చేశారు. విశ్వక్‌సేన్ అభిమాని అయితిరెడ్డి అయ్యప్ప నాయుడు ఫ్రెండ్స్ భారీగజమాల వేశారు. స్వామి థియేటర్ అధినేత పులవర్తి లక్ష్మణస్వామి, కరన్ సి పిక్చర్స్ రాజు, అనుశ్రీ హరిబాబు, అనుశ్రీ రాజు పాల్గొన్నారు.

వేలం ఖరారు

మధురపూడి: కోరుకొండ పంచాయతీ పరిధిలో ఆశీలు, కబేళా నిర్వహణకు శుక్రవారం బహిరంగ వేలం ప్రశాంతంగా జరిగింది. గ్రామంలోని ఆశీలు వసూలును రూ.4,16,000కు వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లిడి చంటిరెడ్డి పాడుకున్నారు. కబేళాను బాల సుబ్రహ్మణ్యం రూ.29 వేలకు దక్కించుకున్నారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు వీరికి హక్కు లభించింది. నిర్వహణ అధికారిగా పంచాయతీ సెక్రటరీ కె.రమేష్ బాబు వ్యవహరించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, ఉప సర్పంచ్ నేతుల చిన్ని, ఎంపీటీసీ కాళ్ల వీరబాబు, సచివాలయం–2 సెక్రటరీ ఏ.గణపతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన పాలడుగుల రామచంద్రరావును గురువారం రాత్రి గతంలో జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని రుద్రం వెంకట్రావుతో పాటుగా మరో ఐదుగురు కొట్టినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ శుక్రవారం తెలిపారు. అలాగే రుద్రం వెంకట్రావును పాలడుగుల రామచంద్రరావు కొట్టినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

క్రీస్తు బోధనలతో మానవాళికి మేలు

మధురపూడి: క్రీస్తు బోధనలను అనుసరించడం ద్వారా మానవాళికి మేలు జరుగుతుందని ఫాదర్ బత్తుల జయరాజు అన్నారు. కోరుకొండ ఎస్సార్ నగర్, సీతానగరం మండలం కూనవరం ఆర్‌సీఎం చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శ్రమల కాలంలో క్రైస్తవులు ఉపవాస దీక్షలతో పాటు, దానధర్మాలు చేయాలన్నారు.

అమరవీరులకు నివాళి


కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సభను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉమెన్స్ కళాశాల వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా కార్యదర్శి కిరణ్ కుమార్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కె.భానుప్రసాద్, దినేష్ బాబు, ధర్మేష్ కుమార్, లావణ్య స్వాతి, రూప, కుమారి పాల్గొన్నారు.

మీటర్ చిత్రబృందం సందడి


ఐఎస్‌టీఎస్ కాలేజీలో హీరో కిరణ్ అబ్బవరం

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో మీటర్ చిత్ర బృందం శుక్రవారం సందడి చేసింది. కిరణ్ అబ్బవరం హీరోగా రమేష్ కాదూరి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందించారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం విద్యార్థినులతో మాట్లాడారు. ఆ చిత్రంలోని పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేసి ఉత్సాహం నింపారు. కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రమని, వినోదానికి అధిక ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి ఒక్కరూ థియేటర్‌లో ఈ సినిమాను చూసి ఆదరించాలని కోరారు.

క్షయ నిర్మూలనకు సమష్టి కృషి


ధవళేశ్వరంలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

ధవళేశ్వరం: క్షయ మహమ్మారిని నిర్మూలించేందుకు సమష్టి కృషి చేయాలని ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.సుధాకర్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ధవళేశ్వరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ గతంలో టీబీ సోకిన వ్యక్తికి మాత్రమే చికిత్స అందించేవారని, ఇప్పుడు రోగి కుటుంబ సభ్యులకు వ్యాధి సోకకుండా చికిత్స ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శేషమణి, హెచ్‌వీ ఫిబే, సూపర్‌వైజర్ బీఎస్ కుమారి, టీబీ హెచ్‌వీ రమణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూరుశాతం పన్నుల వసూలు


సంపరలో సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అమ్మాజీ

పెదపూడి: మండలంలోని 18 గ్రామాలకు గాను 16 చోట్ల నూరు శాతం పన్నులు వసూలు చేయడం అభినందనీయమని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డిని కాకినాడ డీఎల్‌పీఓ వై.అమ్మాజీ ప్రశంసించారు. సంపరలో పన్ను వసూళ్ల ప్రత్యేక డ్రైవ్‌ను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మాజీ మాట్లాడుతూ మండలంలో రూ.1.36 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉండగా రూ.1.17 కోట్లు వసూలు చేశారన్నారు. మొత్తం 85.64 శాతం పూర్తయిందన్నారు. 16 గ్రామ పంచాయతీల్లో నూరు శాతం పూర్తవ్వగా మిగిలిన జి.మామిడాడ, సంపర గ్రామాల్లో వేగవంతం చేశారన్నారు. అనంతరం గ్రామంలో పన్నులు వసూళ్లు పూర్తి చేసిన కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం మెరుగుపర్చాలని, కుక్కలను నియంత్రించాలని, పగటి సమయంలో వీధిదీపాలు వెలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, జి.త్రినాథ్, బి.ప్రసన్నకుమార్, ఎస్‌వీ స్వామి, శిరీష, తరుణ్, మనోజ్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు


ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న ఎంపీహెచ్ ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ అసిస్టెంట్ పవన్‌కుమార్

గోకవరం: కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బందికి జిల్లా ఉత్తమ సేవా పురస్కారాలు అందాయి. మండలంలో టీబీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించినందుకు ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ అసిస్టెంట్ జి.పవన్‌కుమార్‌కు పురస్కారాలు దక్కాయి. శుక్రవారం రాజమహేంద్రవరంలో జరిగిన టీబీ నివారణా దినోత్సవం కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ, జిల్లా టీబీ అధికారి డాక్టర్ వసుంధర చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర, ఎస్‌టీఎస్ వి.శ్రీనివాస్, ఇతర వైద్య సిబ్బంది, అధికారులు అభినందనలు తెలిపారు.

సినిమాలు



శ్యామల	: బలగం
సూర్యమినీ	: దాస్‌కాధమ్కీ
సూర్యప్యాలెస్	: ఫలానఅబ్బాయి ఫలాన అమ్మాయి
స్వామి	: దాస్‌కాధమ్కీ
శివజ్యోతి	: రంగమార్తాండ
అనుశ్రీ	: దాస్‌కాధమ్కీ
రాజా	: దాస్‌కాధమ్కీ
అశోక	: సార్
ఊర్వశి	: కోస్టి
రంభ	: షజామ్
మేనక	: క్లోజ్
గీతాఅప్సర	: కబ్జా
నామవరం	
వీఎస్.మహల్	: రంగమార్తాండ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: దాస్‌కాధమ్కీ